పది పరీక్షలకు వేళాయె

- నేటి నుంచి పదో తరగతి పరీక్షలు
- పోలీస్ స్టేషన్లకు చేరుకున్న ప్రశ్నాపత్రాలు
- పరీక్షలకు హాజరుకానున్న 3,103 మంది విద్యార్థులు



పత్తేపురంలో విద్యార్థులకు సూచనలు ఇస్తున్న నిడమర్రు ఎంఈఓ-2 భాస్కర్



భీమడోలు పరీక్షా కేంద్రంలో హాల్ టిక్కెట్ల నంబర్లు వేస్తున్న విద్యాశాఖ సిబ్బంది



దెందులూరు: పరీక్ష రాసేందుకు సిద్ధమైన విద్యార్థులు

నిడమర్రు: ఉంగుటూరు నియోజకవర్గంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. సోమవారం నుంచి ప్రారంభమయ్యే పరీక్షల కోసం కేంద్రాలు సిద్ధం చేశారు. నియోజకవర్గంలో మొత్తం 3,103 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఈ పరీక్షల పర్యవేక్షణకు 20 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 20 మంది డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లును, 171 మంది ఇన్విజిలేటర్లును నియమించారు. ఆదివారం అన్ని పరీక్షా కేంద్రాల్లో ఇన్విజిలేటర్లుకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాలు ఆయా మండలాల పోలీస్ స్టేషన్‌లకు చేరుకున్నాయి. కేంద్రాల్లో పరీక్షలను ఉదయం 9.30 గంటల నుంచి 12.45 వరకూ నిర్వహించేలా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయా మండల విద్యాధికారులు తెలిపారు.

స్కూల్ అసిస్టెంట్‌లకు ప్రాధాన్యత

పరీక్షల నిర్వహణలో ముఖ్యమైన ఇన్విజిలేటర్ల నియామకంలో స్కూల్ అసిస్టెంట్లకు ప్రాధాన్యత ఇచ్చారు. స్కూల్ అసిస్టెంట్‌లు సరిపోని పక్షంలో ఎస్జీటీలను నియమించారు. ప్రతి 20 మంది విద్యార్థులకు ఒక ఇన్విజిలేటర్ చొప్పున నియమించారు. నియోజకవర్గంలో 171 మంది ఇన్విజిలేటర్లులో 40 శాతం మంది స్కూల్ అసిస్టెంట్‌లను, మిగిలిన 60 శాతం మంది ఎస్జీటీలను నియమించారు. స్కూల్ అసిస్టెంట్‌లు వారి సబ్జెక్టుకు సంబంధించిన పరీక్ష రోజు రిలీవ్ చేస్తారు. ఈనెల 17 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకూ 7 పరీక్షలు నిర్వహించనున్నారు. రోజు విడిచి రోజు పరీక్ష ఉన్నందున పరీక్ష లేని రోజున ఇన్విజిలేటర్లుగా నియమించిన టీచర్లు వారి పాఠశాలల్లో హాజరవ్వాల్సి ఉంది. ఇన్విజిలేటర్లు తప్పనిసరిగా టీచర్ అటెండెన్స్ యాప్‌లో పరీక్ష రోజు ఉదయం 8 గంటల లోపు ఎస్ఎస్‌సీ డ్యూటీగా అప్లై చేయాలి. పేషియల్ అటెండెన్స్ తప్పనిసరిగా పరీక్షా కేంద్రాల వద్ద నమోదు చేయాలి.

విద్యార్థులకు సూచనలు

ఉదయం 8.45 నుంచి 9.30 వరకూ మాత్రమే విద్యార్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారు. తరువాత గేట్లు మూసి వేస్తారు. విద్యార్థులంతా హాల్‌టికెట్‌పై ముద్రించిన తమ వివరాలు సరిచూసుకోవాలి. రోల్ నెంబర్ ఆధారంగా విద్యార్థి తనకు కేటాయించిన సీట్లో కూర్చున్న తరువాత ఇన్విజిలేటర్ బార్ కోడింగ్, ఓఎంఆర్ షీట్, ప్రశ్నాపత్రం, ఆన్సర్ బుక్‌లెట్ అందజేస్తారు. ఓఎంఆర్‌పై అనవసరపు గీతలు గీయరాదు. పరీక్ష ముగిసే వరకూ విద్యార్థులను బయటకు వెళ్లనివ్వరు. ప్రతి విద్యార్థికి 24 పేజీలతో కూడిన ఆన్సర్ బుక్‌లెట్ ఇస్తారు. అదనంగా పేపర్లు అవసరమైతే మరోక 12 పేజీల బుక్‌లెట్‌ను ఇస్తారు. విద్యార్థులకు ఇచ్చిన ఓఎంఆర్ షీట్, ఆన్సర్ బుక్‌లెట్‌లో ఏ ఒక్క పేజీని చింపినా మాల్ ప్రాక్టీస్‌గా పరిగణించే అవకాశం ఉంది, విద్యార్థులు అన్ని జాగ్రత్తలు తీసుకుని ఆందోళన లేకుండా పరీక్షలు ప్రశాంతం వాతవరణంలో రాయాలి.

మండలం	పరీక్షా కేంద్రాలు	ఇన్విజలేటర్లు	పది విద్యార్థులు
భీమడోలు	06	54	1,164
నిడమర్రు	03	24	396
ఉంగుటూరు	05	49	799
గణపవరం	06	44	744
మొత్తం	20	171	3,103

విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణం

దెందులూరు: పదో తరగతి విద్యార్థులకు పరీక్షా కేంద్రాలకు చేరుకునేందుకు ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పించినట్లు ఆర్టీసీ ఏలూరు డీఎం బి.వాణి తెలిపారు. విద్యార్థి హాల్‌టిక్కెట్ చూపిస్తే తన గ్రామం నుంచి పరీక్ష కేంద్రం ఉన్న ప్రాంతానికి ఉచితంగా ప్రయాణం చేయవచ్చునన్నారు. మండలంలోని 4 పాఠశాలలో 820 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరుకానున్నారు.

ఆల్ ది బెస్ట్

దెందులూరు నియోజకవర్గంలో పదో తరగతి రాసే విద్యార్థులకు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. మంచి మార్కులతో విద్యార్థులు విజయం సాధించాలని ఆకాంక్షించారు.

భీమడోలు నుంచి 1164 మంది

భీమడోలు: మండల పరిధిలోని ఆరు కేంద్రాల్లో 1164 మంది ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్షా కేంద్రాలల్లో ఆదివారం విద్యార్థుల హాల్ టిక్కెట్లను వేసి సీటింగ్ ఏర్పాట్లు చేసారు. ఎక్కడా మాస్ కాపీయింగ్ జరగకుండా పగడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు ఎంఈవో ఈదుపల్లి శ్రీనివాసరావు తెలిపారు. భీమడోలు ఉన్నత పాఠశాలలో 274 మంది, పోలసానిపల్లిలో 138 మంది, పూళ్లలో 180 మంది, గుండుగొలనులో 250 మంది, ఆగడాలలంకలో 166 మంది, భీమడోలులోని శ్రీచైతన్య పాఠశాలలో 146 మంది పరీక్షలు రాయనున్నారు. ఇందులో రెగ్యులర్ విద్యార్థులు 979 మంది కాగా సప్లిమెంటరీ విద్యార్థులు 185 ఉన్నారు.

దెందులూరు నుంచి 820 మంది

దెందులూరు: మండలంలో పదో తరగతి పరీక్షలకు 820 మంది విద్యార్థులు హాజరుకానున్నారని ఎంఈవో ఏవీఎస్‌వీ ప్రసాద్ తెలిపారు. దెందులూరు, పోతునూరు, కొవ్వలి, గోపన్నపాలెం ఉన్నత పాఠశాలల్లోని పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేశామని, ఇన్విజిలేటర్లను 43 మందిని నియమించామని చెప్పారు.


విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ



విద్యార్థులకు పరీక్షా సామగ్రిని అందించిన దృశ్యం

భీమడోలు: సూరప్పగూడెం చర్చిలో సామాజిక కార్యకర్త మండే సుధాకర్ ఆర్థిక సాయంతో పదో తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా రక్షణ సైన్యం చర్చి ఫాదర్ కె.అబ్రహం మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు సూచించారు. తొలుత విద్యార్థుల కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో సిస్టర్ ఏస్తేరు, సంఘం పెద్దలు బి.మధు, బి.ఆదినారాయణ, విద్యార్థులు, తల్లిదండ్రులు, విశ్వాసులు పాల్గొన్నారు.

అమలులో 144 సెక్షన్



భీమడోలు సీఐ యూజే విల్సన్

భీమడోలు: పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్న దృష్ట్యా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని సీఐ యూజే విల్సన్ ఆదివారం విలేకరులకు తెలిపారు. 200 మీటర్ల పరిధిలో జిరాక్స్ షాపులు మూసి వేయాలన్నారు. పరీక్షా కేంద్రానికి విద్యార్థులు అరగంట ముందుగానే హాజరు కావాలన్నారు. విద్యార్థులు పదో తరగతి హాల్ టిక్కెట్ చూపి ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎస్సై వై.సుధాకర్, సిబ్బంది ఉన్నారు.

క్లుప్తంగా

ముగ్గుళ్లమ్మకు పూజలు



ముగ్గుళ్లమ్మ వారిని దర్శించుకున్న వాసుబాబు, పార్టీ నేతలు

గణపవరం: మండలంలోని ముగ్గుళ్ల గ్రామ దేవత శ్రీ ముగ్గుళ్ల అమ్మవారి జాతర మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం అమ్మవారిని మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు దర్శించుకుని పూజలు చేశారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దండురాము, జిల్లా వ్యవసాయ సలహా సంఘం మాజీ అధ్యక్షుడు వెజ్జు వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ దేవారపు సోమలక్ష్మిబాబు, స్థానిక పార్టీ నాయకులు ఉన్నారు.

శ్మశానవాటికలో శివుడి విగ్రహం ఏర్పాటు



శ్మశానవాటికలో శివుడి విగ్రహాన్ని నెలకొల్పిన దృశ్యం

దెందులూరు: పోతునూరు పంచాయతీ ఉండ్రాజవరంలోని హిందూ శ్మశానవాటికలో ఆదివారం శివుడి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన సున్నా వెంకట్రావు, భూలక్ష్మి దంపతుల మనవడు లక్ష్మినారాయణ జ్ఞాపకార్థం శివుడి విగ్రహాన్ని నెలకొల్పారు. శివుని విగ్రహాన్ని గ్రామపురవీధుల్లో ఊరేగిస్తూ అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ముగిసిన దండు మారెమ్మ జాతర

గణపవరం: గత వారం రోజులుగా వైభవంగా జరిగిన దండుమారెమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈసందర్భంగా ఆలయంవద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఆయన్ను ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దుశ్శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. అన్నసమారాధనలో వాసుబాబు పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు దండు రాము, కాకర్ల శ్రీను, వెజ్జు వెంకటేశ్వరరావు, కొనిశెట్టి రమేష్ పాల్గొన్నారు.

చర్చి నిర్మాణానికి విరాళం



ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

దెందులూరు: మేదినరావుపాలెం గ్రామ శివారు కొవ్వలివారి గూడెంలో చర్చి నిర్మాణానికి ఆదివారం గ్రామ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నేత మనుబోలు దుర్గకుమారిరాజు విరాళంగా రూ.10 వేలు నగదును చర్చి పాస్టర్ శ్యాంబాబుకు అందజేశారు. త్వరితగతిన చర్చి నిర్మాణం జరగాలని, ఆధ్యాత్మిక అభివృద్ధికి కృషి చేయాలని పాస్టర్లకు సూచించారు.

మంచినీటి కోసం స్టీల్ టిన్నుల ఏర్పాటు



తాగునీటికి స్టీల్ టిన్నులు ఏర్పాటు చేసిన దృశ్యం

దెందులూరు: గోపన్నపాలెం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు తాగునీటి అందించే స్టీల్ టిన్నులు ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు ప్లాస్టిక్ డబ్బాల్లో అపరిశుభ్రంగా ఉన్న నీటిని గమనించిన విజిలెన్స్ కమిటీ విద్యార్థులకు సురక్షిత తాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించింది. దీంతో పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం సత్యనారాయణ వెంటనే స్టీల్ టిన్నులు ఏర్పాటు విద్యార్థులకు తాగునీరు అందిస్తున్నారు.

మంచినీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు



పాతూరు చెరువులో పూజలు చేసి నీటిని విడుదల చేస్తున్న సర్పంచ్, వార్డు సభ్యులు

భీమడోలు: వేసవిలో మంచినీటి ఎద్దడి తలెత్తకుండా అన్ని చర్యలు చేపట్టామని సూరప్పగూడెం సర్పంచ్ వెజ్జు బాలాజీ అన్నారు. సూరప్పగూడెం పంచాయతీ పరిధిలోని పాతూరు గ్రామంలో ఎన్నో ఏళ్లుగా పూడుకుపోయిన మంచినీటి చెరువును గ్రామపంచాయతీ నిధులతో పూడిక తీసి అభివృద్ధి చేశారు. పూడిక తీసిన చెరువులో ఆదివారం నీటి విడుదల కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామకార్యదర్శి ఎం.ముత్తయ్య, వార్డు సభ్యులు వెజ్జు నాగేశ్వరరావు, మామిడిపల్లి కృష్ణకుమారి, ఆదిరెడ్డి విజయలక్ష్మి, షేక్ ఖాజాబి పాల్గొన్నారు.

బీసీల సమస్యలపై రాజకీయాలకు అతీతంగా పనిచేయాలి



జరజాపు రాఘవను అభినందిస్తున్న బీసీ నాయకులు

ఏలూరు (టూటౌన్): బీసీల సమస్యలపై రాజకీయాలకు అతీతంగా పనిచేయాలని నాగవంశ సంక్షేమ సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి బాయి వెంకట్రావు పిలుపునిచ్చారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘంఏలూరు నగర యువజన అధ్యక్షుడిగా ఎన్నికైన జరజాపు రాఘువనాగ వంశ సంక్షేమ సంఘ నాయకులు ఆదివారం స్థానిక సంఘం కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా భాయి వెంకట్రావు మాట్లాడుతూ నాగ వంశీయులకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం లో సముచిత స్థానం ఇచ్చినందుకు రాష్ట్ర అధ్యక్షులు వైనాగేశ్వరరావు కన్వీనర్ నూకాలమ్మ, జిల్లా అధ్యక్షుడు లక్కోజు గోపి లకు ధన్యవాదాలు తెలియజేశారు. బీసీ యువతకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని ఉద్యోగాలు లేక ఇబ్బంది పడుతున్న యువతకు అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఏలూరు యువజన సెక్రటరీ ఈదలాడ ఉమామహేశ్వరరావు, జిల్లా కోశాధికారి భాయి వెంకటరావు,చ టౌన్ సెక్రెటరీ కొండల ప్రసాద్, టౌన్ వైస్ ప్రెసిడెంట్ జరజాపు ఉమా తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం



భీమడోలులో దాతల చేతుల మీదుగా ఫ్రీజర్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

భీమడోలు: ఉత్తమ సమాజ స్థాపనే లక్ష్యంగా పనిచేస్తున్న మానవత స్వచ్ఛంద సేవా సంస్థకు దాతల సహకారం అభినందనీయమని ఆ సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. భీమడోలు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మండలశాఖకు సత్తి సోమరాజు, సావిత్రిదేవిల జ్ఞాపకార్థం వారి కుమార్తెలు రూ.25వేలు, ఆర్నిపల్లి వసంత్‌కుమార్ రూ.10 వేలు, దత్తాడ ప్రసాద్‌రాజు, పోలసానిపల్లి సర్పంచ్ దంపతులు షేక్ రహీమాబేగం, షేక్ హసేనాలు రూ.10వేలు, ఉసిరిక గాంధీ కుమారులు రూ.10వేల ఆర్థిక సాయంతో కొనుగోలు చేసిన ఫ్రీజర్‌ను ప్రారంభించారు. మానవత ప్రతినిధులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అమరజీవి త్యాగం చిరస్మరణీయం



గణపవరంలో పొట్టిశ్రీరాములుకు నివాళులర్పిస్తున్న నాయకులు

గణపవరం: ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగాన్ని రెండు తెలుగురాష్ట్రాల ప్రజలు మరచిపోరని, ఆయన త్యాగం భావితరాలకు ఆదర్శప్రాయమని అఖిలభారత హేండ్‌లూమ్స్ డైరెక్టర్ నంద్యాల రామలింగరాజు అన్నారు. ఆదివారం పొట్టిశ్రీరాములు జయంతి సందర్భంగా గణపవరం సంత మార్కెట్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాపోలు సూర్యారావు, ఆదపరెడ్డి సీతయ్య, అబ్దుల్ వహబ్, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దెందులూరు: ఆంధ్ర రాష్ట్ర సాధనకోసం తన ప్రాణాన్ని త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు చిరస్మరణీయులని దెందులూరు మండలం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చల్లంచర్ల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు గాదంశెట్టి సుబ్బారామయ్య అన్నారు. ఆదివారం పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా దెందులూరు బస్టాండ్ సెంటరులో పొట్టి శ్రీరాములు, మహాత్మాగాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘ కార్యదర్శి సుగ్గిశెట్టి మణికుమార్, కోశాధికారి ప్రగళ్లపాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు కోదండ రామాలయ విగ్రహ ప్రతిష్ఠ



ఉత్సవాల్లో భాగంగా నవకలశ స్థాపన నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని రామచంద్రాపురంలో నూతనంగా నిర్మించిన శ్రీ కోదండ రామాలయ పునః ప్రతిష్ఠా మహోత్సవాలు వైభవంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు ఆదివారం ఉదయం గణపతిపూజతో మొదలుకుని మంత్రహోమాలు, నవగ్రహ హోమాలు, ఉదకశాంతి, నవకలశ స్థాపన, ధాన్యాదివాసం, శయ్యాదివాసం, పుష్పాధివాసం, బలిహరణలు నిర్వహించారు. అలాగే గ్రామోత్సవం నిర్వహించారు. నారాయణ వేద పారాయణలు, హోమాలు, నీరాజన మంత్రపుష్పాలు, చతుర్వేది స్వస్తి వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఆలయంలో విగ్రహ, యంత్ర, శిఖర, ధ్వజ, పరివార దేవతా ప్రతిష్ఠా వైభవంగా త్రిదిన దీక్షతో నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ అభివృద్ధి కమిటీ గౌరవాధ్యక్షుడు పరిమి ధర్మరాజు, పరిమి సత్తిపండు, కొండ్రెడ్డి కిషోర్, అధ్యక్షుడు మోతుకూరి నారాయణరావు తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

దెందులూరు తొలి ఎంపీపీ మృతి

దెందులూరు: దెందులూరు తొలి ఎంపీపీ కాట్రు దుర్గా వరప్రసాద్‌రాజు (70) ఆదివారం అనారోగ్యంతో ఆయన నివాసంలో మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు.

గుండెపోటుతో డిగ్రీ కాలేజీ అధ్యాపకుడి మృతి



డా.టి.అక్కిరాజు

గణపవరం: గణపవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంగ్ల అధ్యాపకునిగా, ఐక్యూఏసీ కోఆర్డినేటర్‌గా పనిచేస్తున్న డా.టి అక్కిరాజు (60) శనివారం రాత్రి గుండెపోటుతో మరణించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమారులిద్దరూ జర్మనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా స్థిరపడ్డారు. భీమవరంలో నివాసం ఉంటున్న అక్కిరాజు గణపవరం ప్రభుత్వ డిగ్రీకాలేజీలో గత నాలుగేళ్లుగా ఆంగ్ల అధ్యాపకునిగా పనిచేస్తున్నారు. ఆయన భౌతిక కాయాన్ని ఆదివారం ప్రిన్సిపాల్ పి.నిర్మలకుమారి, వైస్ ప్రిన్సిపాల్ పి.మధురాజు, గణపవరం ఎంఈవో గొర్రెల బాలయ్య, కాలేజీ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది సందర్శించి నివాళులు అర్పించారు.

వైభవంగా అమ్మవార్ల గంప జాతర



భీమడోలులో గణాచారులకు జలాభిషేకం చేస్తున్న భక్తులు

భీమడోలు: భీమడోలు జాతర మహోత్సవాల్లో భాగంగా ఆదివారం గ్రామదేవతలు శ్రీమద్దిరామమ్మ, శ్రీమహాలక్ష్మమ్మ, శ్రీగంగానమ్మ, శ్రీపోతురాజుల గంప జాతర వేడుకలు వైభవంగా జరిగాయి. ఆలయ జాతర కమిటీ అధ్యక్షుడు దత్తాడ శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ మైదానం నందు గల గంగానమ్మ వారి పురాతన దేవాలయం వద్ద గంప జాతరను ఘనంగా నిర్వహించారు. పంబలి తంగిరాల చిట్టియ్య నేతృత్వంలో గణాచారుల సంబరం చేశారు. గంగానమ్మకు వేపాకులతో కలిగిన పసుపు నీళ్ల బిందెలతో జలాభిషేకం చేశారు. తొలుత గణాచారులు మేళతాళాల నడుమ గ్రామ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అమ్మవార్ల ప్రాంగణాల వద్ద గణాచారులకు భోజనాలు ఏర్పాటు చేసి నూతన వస్త్రాలు బహూకరించారు. కార్యక్రమంలో పెద్దలు కరణం పెద్దిరాజు, ఆళ్తి శ్రీనివాస్, బొమ్ము గాంధీ, తుమ్మల ఉమామహేశ్వరరావు, ముప్పిరిశెట్టి సుబ్రహ్మణ్యం, భక్తులు పాల్గొన్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి రూ.3 లక్షల విరాళం



దాత మధుకళ్యాణ్‌కు విరాళం బాండ్ పత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి ఒక భక్తుడు ఆదివారం రూ.3 లక్షలను విరాళంగా అందజేశారు. కేసరపల్లికి చెందిన జస్తి మధుకళ్యాణ్ ముందుగా కుటుంబసభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ సూపరింటెండెంట్ దుర్గాప్రసాద్ విరాళం బాండ్ పత్రాన్ని అందజేశారు.

గడ్డివాము దగ్ధం



గడ్డి వాము దగ్ధమవుతున్న దృశ్యం

కామవరపుకోట: మండలంలో బొర్రంపాలెం అడ్డ రోడ్డు వాటర్ ట్యాంక్‌ల సమీపంలో ఆదివారం విద్యుత్ తీగలు తెగిపడి గడ్డి వాము దగ్ధమైంది. పశువుల మేత కోసం పామాయిల్ తోటలో నిల్వ ఉంచిన గడ్డివాముపై విద్యుత్ తీగలు పడడంతో దగ్ధమైందని బాధితుడు మారం మధు తెలిపారు. వెంటనే జంగారెడ్డిగూడెం అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు వచ్చి మంటలు అదుపు చేశారన్నారు. కరెంటు సర్వీస్ వైర్లు లూజ్ కండక్ట్ కారణంగా తెగిపడ్డాయని, ఈ ప్రమాదంలో తనకు రూ.లక్ష నష్టం వాటిల్లిందని, నష్టపరిహారం అందించాలని బాధితుడు మధు కోరారు.

కోడి పందేల స్థావరంపై దాడి

పెదవేగి : సీతాపురంలో కోడి పందేల స్థావరంపై దాడి చేసి 11 మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై కె.రామకృష్ణ తెలిపారు. ఈ దాడిలో రూ.6100 నగదు, 4 కోళ్లు, 12 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు.

ముడిచర్ల వాసికి 'అభినవ రామానుజ అవార్డు'



సికింద్రాబాద్‌లో అవార్డు అందుకున్న శ్రీనివాస్ పెరుమాళ్

లింగపాలెం: ముడిచర్లకు చెందిన శ్రీమాన్ తిరుక్కోవత్యూరి శ్రీనివాస పెరుమాళ్‌కు గోల్డ్ మెడల్, సువర్ణ ఘంటాకంకణ సత్కారంతో పాటు 'అభినవ రామానుజ' అవార్డు లభించింది. ఎన్నో ఏళ్లుగా రామానుజ సమతాసిద్ధాంత వ్యాప్తికై చేస్తున్న విశేష కృషిని గుర్తించి, హైదరాబాద్‌కు చెందిన సర్ సీవీ రామన్ సాంస్కృతిక సేవాసంస్థ, రుద్రాక్ష వైభవం ఆధ్యాత్మిక పీఠంవారు ఈ అవార్డును ఆదివారం సికింద్రాబాద్ లోని హరిహరకళాభవన్ ఆడిటోరియంలో ప్రదానంచేశారు. వృత్తిరీత్యా ఉపాధ్యాయుడిగా, ప్రవృత్తి రీత్యా భక్తి గేయ రచయితగా, కవిగా, జ్యోతిష్యుడిగా, గాయకుడిగా, అర్చక పురోహితుడిగా, పుస్తక రచయితగా, ప్రవచనకారుడిగా, ఆధ్యాత్మిక గురువుగా వివిధ మార్గాల్లో రామానుజ సమతాసిద్ధాంతాన్ని శ్రీనివాస్ పెరుమాళ్ వ్యాప్తి చేస్తున్నారు. ఆయనకు 'అభినవ రామానుజ' అవార్డు రావడం పట్ల ఆయన శిష్యులు సంతోషం వ్యక్తం చేశారు.

బాలలు చదరంగంలో రాణించాలి



చదరంగం పోటీల్లో పాల్గొని బహుమతులు అందుకున్న బాలలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): చదరంగ క్రీడలో భారత క్రీడాకారులు ప్రపంచ స్థాయిలో సత్తా చాటుతున్నారని, నేటి బాలలు చదరంగ క్రీడపై మక్కువ పెంచుకుని మరింతగా రాణించాలని చెస్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ పి.భాస్కర్ రామన్ పిలుపునిచ్చారు. స్థానిక రామచంద్రరావు పేటలోని ఏలూరు పబ్లిక్ స్కూల్‌లో చెస్ అసోసియేషన్ ఆఫ్ హేలాపురి, ఏలూరు హేలాపురి ఎలైట్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా చెస్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో జి.అభిషేక్ అబ్రహమ్ ప్రథమ, ఎస్.వర్షిత్ ద్వితీయ, జి.నురూప్ మోషే తృతీయ ఎస్‌కే పర్హాన్ 4వ స్థానంలో నిలిచారు. అనంతరం అతిథులు విజేతలకు బహుమతులు, మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు.

దుర్గమ్మ గుడికి పోటెత్తిన భక్తులు



రెడ్డిగణపవరం కనకదుర్గమ్మ గుడికి పోటెత్తిన భక్తులు

బుట్టాయగూడెం: మండలంలోని రెడ్డిగణపవరంలో కొలువైఉన్న కనకదుర్గమ్మ గుడికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారు జాము నుంచే పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ నెల 14వ తేదీన అమ్మవారి తిరణాళ్ల ప్రారంభంకాగా మూడో రోజు ఆదివారం తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లో ఉన్న పలు జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ తిరణాళ్లలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా జీలుగుమిల్లి సీఐ బి. వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో ఎస్సై దుర్గామహేశ్వరరావు ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా మరో రెండురోజుల పాటు ఉత్సవాలు జరగనున్నాయి.

కంటి సమస్యలపై అప్రమత్తంగా ఉండాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): కంటి చూపునకు సంబంధించి ఎటువంటి చిన్న సమస్య వచ్చినా వెంటనే వైద్య సేవలు పొందడం ద్వారా కంటి చూపును కాపాడుకోవచ్చని పరమహంస యోగానంద నేత్ర వైద్యశాల బృందం ప్రతినిధులు సూచించారు. ఆదివారం స్థానిక రామకోటి ప్రాంగణంలో లయన్స్ క్లబ్ నాయకుడు మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు.

అగ్ని ప్రమాదంలో బేరన్ పాక్షికంగా దగ్ధం

కొయ్యలగూడెం: మంగపతిదేవిపేట గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున సంభవించిన అగ్ని ప్రమాదంలో వర్జీనియా పొగాకు బేరన్ పాక్షికంగా దగ్ధం అయ్యింది. శుక్లబోయిన గోపీచంద్, వెంకటేష్‌లకు చెందిన బేరన్ క్యూరింగ్ దశలో ఉండగా ఈ ప్రమాదం సంభవించిందని జంగారెడ్డిగూడెం అగ్నిమాపక కేంద్రం అధికారి జి.అబ్రహం తెలిపారు. ప్రమాదం వలన సుమారు రెండున్నర లక్షల రూపాయలకు పొగాకు దగ్ధం అయ్యిందని చెప్పారు.